## క్లుప్తంగా

### గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 91 వేల 863 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

### అందుబాటులో ఎరువులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు విండో చైర్మన్ కమలాకర్ రావు తెలిపారు. విండోలో యూరియా, 2020, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఎరువులను తీసుకెళ్లాలని సూచించారు.

### వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సీటు బెల్టులు, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. తనిఖీ కార్యక్రమంలో ఏఎస్సై సంజీవులు, కానిస్టేబులు, హోంగార్డులు పాల్గొన్నారు.

### అంజనాద్రి ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్(జుక్కల్): బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయ ఏడవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త పట్లోళ్ల కిశోర్ కుమార్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అభిషేకాలు, అర్చనలు, అన్నదాన కార్యక్రమాలు జరుపుతున్నామని చెప్పారు. అంజనేయస్వామి భక్తులు ఉత్సవాలకు తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

### గురుకుల పాఠశాల సందర్శన



బాన్సువాడ: మండలంలోని బోర్లం మైనార్టీ గురుకుల పాఠశాలను సోమవారం ఉమ్మడి జిల్లాల విజిలెన్స్ అధికారులు షేక్ హైమద్ జియా, హమిజోద్దీన్‌లు సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం తీరుపై ఆరా తీసారు. స్టాక్ రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతీ రోజు అందుతున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### బ్రెయిలీ కిట్ అందజేత



లింగంపేట(ఎల్లారెడ్డి): భవానిపేట ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి గణేష్‌కు సోమవారం లింగంపేట ఎమ్మార్సీలో బ్రెయిలీ కిట్‌ను జిల్లా సెక్టోరల్ అధికారి నాగవేందర్ పంపిణీ చేశారు. కంటిచూపు మందగించిన విద్యార్థులు భవిత కేంద్రం ద్వారా అలీమ్-కో(న్యూఢిల్లీ) స్వచ్ఛంద సంస్థకు దరఖాస్తు చేసుకోవడంతో వారు ఆ విద్యార్థికి బ్రెయిలీ కిట్‌ను అందించారు. ఐఈఆర్టీలు శ్యామల, అశ్విని, ఎంఐఎస్ స్వప్న, సీఆర్పీ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



పిట్లం(జుక్కల్): చిల్లర్గి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలలోని విద్యార్థులకు దాత నారాయణ క్రీడా టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులకు క్రీడా టీ షర్ట్‌లు లేవని పాఠశాల సిబ్బంది తన దృష్టికి తీసుకు రావడంతో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.

### బోరు మోటార్ ప్రారంభం



దోమకొండ: దోమకొండ బస్టాండులో సోమవారం జెడ్పీ నిధులతో బోరు మోటార్ పనులను ప్రారంభించారు. బోరు డ్రిల్లింగ్ పనులను జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. బస్టాండులో కొంత కాలంగా నీటి సమస్య ఉండటం, ఇటీవల మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరగటంతో సమస్య తీవ్ర మైందన్నారు. నీటి సమస్యను పరిష్కరించడానికి జెడ్పీ నిధులతో బోర్ డ్రిల్లింగ్, బోరు మోటర్, పైపు లైన్ పనులను చేయించనున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు. సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సర్పంచి నల్లపు అంజలి శ్రీనివాస్, ఎంపీటీసీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ‘డబుల్’ ట్రబుల్

- డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసంపూర్తి పనులతో ఇబ్బందులు
- కరెంట్ మీటర్లు లేక కొండీలు వేసుకుంటున్న వైనం
- మరుగు దొడ్ల నిర్మాణాల పనులు పూర్తికాకపోవడంతో ఒకటికి.. రెంటికి ఆరుబయటకే..
- సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారుల వేడుకోలు



కిటికీలకు అద్దాలు బిగించకపోవడంతో అడ్డంగా చీరలు, సంచులు కట్టుకున్న దృశ్యం



డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మీటర్లు బిగించకపోవడంతో వైర్లకు లబ్ధిదారులు వేసుకున్న కొండీలు

కామారెడ్డి రూరల్: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు సమస్యలకు నిలయంగా మారాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించినా కనీస సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, కిటికీలకు అద్దాలు బిగించకపోవడం, మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేయడంతో పేదల కల కలగానే మిగిలిపోయింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామ శివారులో 120 మంది లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇచ్చారు. ఇళ్లు కేటాయించినా పనులన్నీ అసంపూర్తిగా ఉండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

**పట్టా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో..**

ఇళ్లకు సంబంధించిన పట్టా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు కరెంట్ మీటర్లు మంజూరు చేయడం లేదు. దీంతో పక్కనే ఉన్న కరెంట్ వైర్లకు ప్రతి రోజు కొండ్లు వేసుకుని కరెంట్ సరఫరా చేసుకుంటున్నారు. అంతేకాకుండా 120 ఇళ్లకు ఒకే ఒక సెప్టిక్ ట్యాంక్ నిర్మించి దానికి పైప్‌లైన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులందరూ ఒకటికి, రెంటికి ఆరుబయటకే వెళ్లాల్సి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు తమ గోడు విన్నవించుకున్నారు. రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే భయమేస్తుందని పేర్కొంటున్నారు. మరుగుదొడ్లు కూడా నాణ్యత లేకుండా నిర్మించారు. పైప్‌లైన్‌లు లీకేజీ అయి ఇళ్లలోకి నీరు వస్తుందని వాపోతున్నారు. కిటికీల అద్దాలు బిగించకపోవడంతో చలికి చిన్న పిల్లలు నిద్ర పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తమ జేబులు నింపుకోవడానికి ఇళ్లు నిర్మించారని, నాణ్యతతో నిర్మించలేదని లబ్ధిదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఇళ్లలో నెలకొన్న సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

#### పైపులన్నీ లీకేజీ అవుతున్నాయి



డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని అన్ని పైపులు లీకేజీలు అవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులతో చేపిద్దామంటే రూ.5 వేల నుంచి 10 వేలు అడుగుతున్నారు. ఇళ్లు కట్టించిన కాంట్రాక్టర్ పనులను పూర్తి చేసి ఉంటే తమకు ఈ ఇబ్బందులు ఉండేవి కావు. బాత్‌రూంలు నాణ్యతతో చేపట్టకపోవడంతో ఇళ్లన్నీ పదన వస్తున్నాయి.

– సయ్యద్ రజియా, లబ్ధిదారు

#### కిటికీలకు సంచులు కట్టుకున్నాం



డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి కిటికీలకు అద్దాలు బిగించకపోవడంతో చలి విపరీతంగా వస్తోంది. దీంతో జోర సంచులు, చీరలు అడ్డంగా కట్టుకున్నాం. అయినప్పటికీ చలి వస్తూనే ఉంది. అధికారులు స్పందించి కిటికీలకు అద్దాలు వెంటనే పెట్టియ్యాలే.

– ఎంఢ్రియాల బాలమణి, లబ్ధిదారు

## రెండు చోట్ల ఇసుక డంపులు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్): మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి అధికారులు కళ్లు తెరిచారు. గుట్టలలో ఉన్న ఇసుక డంపులను సీజ్ చేయడానికి బిచ్కుంద రెవెన్యూ, పోలీస్ అధికారులు సోమవారం గ్రామ శివారులలో తనిఖీల కోసం పరుగులు తీశారు. సాక్షి దినపత్రికలో సోమవారం అక్రమంగా ఇసుక తరలింపు...అనే శీర్షికన వచ్చిన వార్తా కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐ సాయిబాబా, ఎస్సై మురళీలు గోపన్‌పల్లి, శెట్లూర్, ఖద్గాం, పుల్కల్, హజ్గుల్ గ్రామ శివారులో తనిఖీలు చేపట్టారు. గోపన్‌పల్లి, ఖద్గాంలో లారీలో ఇసుక నింపుతున్న వ్యాపారులు అధికారులు వస్తున్న సమాచారం తెలుసుకొని అక్కడి నుంచి లారీ, టిప్పర్ తీసుకొని పారిపోయారు. గోపన్‌పల్లిలో 14, ఖద్గాంలో 10 ఇసుక కుప్పలను అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అధికారులు చేరుకునే సమయానికి సుమారు 60 ఇసుక కుప్పలు మాయమయ్యాయి.



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న అధికారులు

**పట్టుబడిన టిప్పర్, మైన్స్ అధికారులకు అప్పగింత**

పై అధికారులు ఆదేశాలతో ఆదివారం రాత్రి పోలీసులు తనిఖీ చేసి అక్రమంగా ఇసుక తరలిస్తు పట్టుకున్న టిప్పర్‌ను జిల్లా మైన్స్ శాఖకు అప్పగించినట్లు ఎస్సై మురళి తెలిపారు. డంపు చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసి పై అధికారులు సమాచారం ఇచ్చినట్లు ఆర్ఐ సాయిబాబా తెలిపారు.

## సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న కార్యకర్తలు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

మద్నూర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని జుక్కల్ నూతన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లక్ష్మీబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలిసారి సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని పాలించిన గత ప్రభుత్వాన్ని తాను విమర్శించదలుచుకోలేదన్నారు. ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు.

**ఆరోగ్య శాఖపై ప్రత్యేక దృష్టి**

పేదవారికి ఎంతో ముఖ్యమైన ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడతానని ఎమ్మెల్యే చెప్పారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని ఆరోగ్య శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్‌ను ఆదేశించారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు సభలో చదివి వినిపించారు.

**బిచ్కుందలో విజయోత్సవ ర్యాలీ**

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్లి వారి ఆకాంక్షలు నెరవేర్చుతానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుందలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై నివేదిక తయారు చేసి పరిష్కారం వైపు అడుగులు వేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీఆర్ఎస్ నాయకులు బిచ్కుందలో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేశామని గొప్పలు చెప్పుకొని ఒక్క వైద్యుడి కూడా నియమించలేదని ఆరోపించారు. వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, సీనియర నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్, కమల్ కిషోర్, పీసీసీ డెలిగేట విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

పిట్లం/మద్నూర్(జుక్కల్): ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ సమక్షంలో సోమవారం పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కాస్లాబాద్, మద్నూర్ మండలానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఘనంగా పోచమ్మ ఉత్సవాలు

రాజంపేట: కొండాపూర్‌లో శ్రీ నల్ల పోచమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల జెడ్పీటీసీ కొండ హనుమాండ్లు శ్రీ నల్ల పోచమ్మ ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని మహిళలకు బోనం కడువలు వితరణ చేశారు.



పూజలు చేస్తున్న మహిళలు

### అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గం



భిక్కనూరు: అయ్యప్ప సేవా సమితి భిక్కనూరు నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాటిపాముల లింబాద్రి, అధ్యక్షుడిగా ఏలేటి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బోరేటి సిద్ధరాములు, ప్రధాన కార్యదర్శిగా సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ముదాం సురేశ్, కోశాధికారిగా గజవాడ రామక్రిష్ణ, సలహాదారులుగా ఎల్.గంగాగౌడ్, జి.ఆనంద్ కుమార్, జి.అనిల్ కుమార్, కే.బాల్‌రెడ్డి, పెద్దబచ్చగారి శ్రీనివాస్‌రెడ్డి, ఏ.శ్రీనివాస్, నాగార్తి పోతిరెడ్డి, ఎస్.తిరుపతిరెడ్డి, మద్ది సూర్యకాంత్‌రెడ్డి, నాగార్తి నర్సారెడ్డి, ఎమ్.రమేశ్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఏలేటి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

### దేవునిపల్లి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కైరంకొండ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా జొన్రిగల నర్సయ్య, కోశాధికారిగా మాడ నాగభూషణం, ఉపాధ్యక్షులుగా దాస కిషన్, వైట్ల కృష్ణ, సహాయ కార్యదర్శులుగా కుసుమ రమేశ్, ముదిగొండ రాఘవేందర్, ముఖ్య సలహాదారులుగా ఇప్పకాయల పోశెట్టి, ఇంజమూరి నారాయణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణస్వీకారం చేశారు.

### బీఆర్ఎస్ నేతల ఆగడాలు మితిమీరుతున్నాయి

- పాల్వంచ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్ గౌడ్



మాచారెడ్డి: ఉమ్మడి మాచారెడ్డి బీఆర్ఎస్ నేతల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని పాల్వంచ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ గౌడ్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడారు. మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ రావు పాల్వంచ మండలం దేవునిపల్లిలో కంకర క్వారీ నడుపుతూ అక్కడి భూములను అన్యాక్రాంతం చేస్తున్నారని విమర్శించారు. కంకర క్వారీలో పేలుళ్లతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయంతో కాలం గడుపుతున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే ఆయన తన అనుచరులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నాయకులు ఇంతియాజ్, రవిగౌడ్, మజార్, షరీఫ్, సమరసింహారెడ్డి, భూపతిరెడ్డి ఉన్నారు.

## పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

పిట్లం(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని నోడల్ అధికారి రమణారావు పేర్కొన్నారు. ఆయన మంగళవారం బొల్లక్‌పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నెలవారీ రిపోర్ట్ ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సీఆర్పీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ‘పీఎం విశ్వకర్మ యోజన’ను సద్వినియోగం చేసుకోవాలి

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అలే భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న అలే భాస్కర్

బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పీఎం విశ్వకర్మ యోజనను అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అలే భాస్కర్ అన్నారు. సోమవారం బాన్సువాడ బీజేపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జనవరి 26 వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా ప్రచారం చేయాలని, పీఎం విశ్వకర్మ యోజన ద్వారా చేతి కుల వృత్తుల వారికి పథకాలు రూపొందించారని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ కార్గే, అధికార ప్రతినిధి స్వామియాదవ్, కో-కన్వీనర్ భూపాల్, ఓబీసీ జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఈ-కేవైసీ కోసం బారులు



సుల్తాన్‌నగర్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

నిజాంసాగర్(జుక్కల్): సుల్తాన్‌నగర్‌లో హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద సోమవారం ఈ-కేవైసీ కోసం మహిళలు బారులు తీరారు. లబ్ధిదారులు ఏజెన్సీల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రకటించడంతో మహిళలు తరలి వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు మండుటెండలో పడిగాపులు కాసి ఈ-కేవైసీ చేయించుకుంటున్నారు. గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి మహిళ ఆధార్‌తో పాటు వేలి ముద్ర నమోదు తప్పనిసరిగా చేయడంతో మహిళలు పోటీ పడుతున్నారు.

## ఓటరు జాబితా సవరణ చేపట్టాలి



సూచనలిస్తున్న ఉప తహసీల్దార్ రాజేశ్వర్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల సవరణ చేపట్టాలని సోమవారం ఉప తహసీల్దార్, బీఎల్‌వోలకు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్‌వోల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. చనిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఓటు హక్కు కలిగి ఉండి ఇతర ప్రాంతాలకు వెళ్తే వారికి నోటీసులు ఇచ్చి తొలగించాలన్నారు. ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు.

## పంటల పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రజాపతి



నర్సరీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజీవీర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్‌లో సోమవారం మండల వ్యవసాయాధికారి ప్రజాపతి శనగ పంటలను పరిశీలించారు. పంటలో వ్యాప్తి చెందుతున్న తెగుళ్లను, పురుగులను గమనించారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఏఈవో శ్రీనివాస్ నాయక్, రైతులు స్వామి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

**నర్సరీ పనులు..**

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎండ్రియాల్ శివారు నర్సరీలో జరుగుతున్న పనులను సోమవారం ఎంపీడీవో రాజీవీర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో తప్పని సరిగా 10వేల మొక్కలను పెంచాలన్నారు. గ్రామాల్లో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలన్నారు. మొక్కలకు ప్రతిరోజు నీరు పోసి సంరక్షించాలన్నారు. ఎంపీవో హెక్సిఫా రాణి ఉన్నారు.

## ఘనంగా సెవెన్ హార్స్ ఎన్జీవో వార్షికోత్సవం




ప్రశంసా పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ రోటరీ క్లబ్‌లో సెవెన్ హార్స్ ఆర్గనైజేషన్ ఎన్జీవో మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాసా శాస్త్రవేత్త డాక్టర్ కావ్య మాన్యపు హాజరయ్యారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి ప్రతిభ చాటిన వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.

సమాజంలో సేవే శాశ్వతమని, డబ్బు శాశ్వతం కాదని ఆమె అన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యం, ఎన్జీవో ఫౌండర్ జీవన్ నాయక్, ప్రతినిధులు మసూద్, విద్యార్థులు పాల్గొన్నారు.